

వరంగల్‌లో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



కేయూలో కె-హబ్ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు



మహిళలకు చెక్కులు అందజేస్తున్న మంత్రులు పొంగులేటి, సురేఖ

పేదల సంక్షేమమే సర్కారు లక్ష్యం

90 రోజుల్లో 4 గ్యారంటీలు అమలు చేశాం..

- నేడు ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం
- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- వరంగల్ తూర్పులో రూ.258 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- కేయూ, సమ్మయ్యనగర్‌లో పలు ప్రారంభోత్సవాలు
- పాల్గొన్న మంత్రులు కొండా సురేఖ, సీతక్క ఎమ్మెల్యేలు

గిర్మాజిపేట, మార్చి 10: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ఇందిరమ్మ రాజ్యం కోసం ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లోనే అభయ హస్తంలోని ఆరు గ్యారంటీలలో నాలుగు అమలుచేసి ప్రజల మన్ననలు పొందామన్నారు. ఆదివారం వరంగల్ నగరంలోని ఎస్ఎస్ఎం క్లబ్ సమీపంలోని మునిసిపల్ స్థలంలో వరంగల్ తూర్పు నియోజకవర్గంలో రూ.258కోట్లతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖల మంత్రి కొండాసురేఖ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కలతో కలిసి మంత్రి పొంగులేటి శంకుస్థాపనలు,ప్రారంభోత్సవాలు చేశారు. అలాగే పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు, వికలాంగులకు వాహనాలను మంత్రులు పంపిణీ చేశారు. అలాగే వరంగల్‌లో తాత్కాలిక ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను మంత్రులు ప్రారంభించారు.

అనంతరం మంత్రి సురేఖ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. యువతకు ఉద్యోగం, పేదలకు ఇందిరమ్మ ఇల్లు, ఉచితంగా 10 లక్షల ఆరోగ్యశ్రీ, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్, రూ.200 యూనిట్లకు ఉచిత విద్యుత్తు పథకాలన్నింటినీ చిత్తశుద్ధితో అమలు చేస్తున్నామన్నారు. ప్రజల ఆకాంక్షలను గుర్తించి కాంగ్రెస్ నాయకురాలు సోనియ గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తే రెండుసార్లు అధికారం చేపట్టిన కేసీఆర్.. ధనిక రాష్ట్రాన్ని అప్పులు అప్పులు పాలుచేశాడని మండిపడ్డారు. పదేళ్లలో ఒక్క డబుల్‌బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వలేదని ఆరోపించారు. కేసీఆర్ తనకు కావాల్సిన ప్రగతిభవన్‌ను, 250 ఎకరాల ఫామ్ హౌస్‌ను విలాసవంతంగా కట్టుకున్నాడని ధ్వజమెత్తారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్లను గత ప్రభుత్వం లీకేజీలు చేయించడంతో నిరుద్యోగుల ఆవేదన పడ్డారని, వారి బాధను అర్థం చేసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. నిజాయితీపరులైన అధికారులతో టీఎస్‌పీఎస్‌ను పక్షాళన చేసి ఉద్యోగ నోటిఫికేషన్‌లు వేస్తున్నారని మంత్రి శ్రీనివాసరెడ్డి గుర్తు చేశారు. అధికారం చేపట్టిన 72 రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం 31వేల ఉద్యోగాలను ఇచ్చిందని, ఎన్నికల హామీలో భాగంగా 2లక్షల ఉద్యోగాలు ఇవ్వడం ఖాయమని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ జాతీయ నాయకులు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, మల్లికార్జున ఖర్గేలు ఎన్నికల ముందు ఇచ్చిన అభయహస్తం 6 గ్యారంటీలలో ముఖ్యమైన ఇందిరమ్మ ఇల్లు పథకాన్ని సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భద్రాచలంలో ప్రారంభిస్తున్నారని మంత్రి పొంగులేటి చెప్పారు. ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలుచేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ప్రజలు చేయూతగా నిలవాలని మంత్రి శ్రీనివాసరెడ్డి కోరారు. మంత్రి కొండా సురేఖ వరంగల్ తూర్పు నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషిచేస్తున్నారని ఆయన ప్రశంసించారు.



కొండా సురేఖ



సీతక్క

మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ప్రజలకు నిజమైన సంక్షేమం అందుతుంటే చూడలేని ఈర్ష్యాపరులు బీఆర్ఎస్ నాయకులని ఎద్దేవా చేశారు. ఉద్యోగులకు మొదటి రోజు జీతాలు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, రూ.200 యూనిట్లకు ఉచిత విద్యుత్తు అమలుతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు తమ గుండెల్లో పెట్టుకోవడాన్ని బీఆర్ఎస్ నాయకులు తట్టుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. మహిళలకు జీవో 6 ద్వారా అన్యాయం జరుగుతోందని మొత్తుకుంటున్న ఎమ్మెల్సీ కవితకు, అసలు ఆ జీవో తెచ్చిందే వారి ప్రభుత్వమనే విషయం తెలియకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.

మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. రాష్ట్రం వచ్చిన 10ఏళ్ల తర్వాత ప్రజలు ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకున్నారన్నారు. ఇప్పటికే నాలుగు గ్యారంటీలు అమలు చేశామని, ఐదో గ్యారంటీ ఇందిరమ్మ ఇల్లు సోమవారం నుంచి అమలులోకి రాబోతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

మిగతా 6వ పేజీలో..



వరంగల్ బస్ స్టాండ్ పనులను ప్రారంభిస్తున్న మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి



హనుమకొండ సమ్మయ్య నగర్ వద్ద అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు

ఆయూరే.. రమజాన్

- రేపటి నుంచే పవిత్ర ఉపవాస దీక్షలు ప్రారంభం
- నేటి నెలవంక దర్శనం కోసం ఎదురుచూపులు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో ముస్తాబవుతున్న మసీద్‌లు



ముస్లింల నెలరోజుల ఉపవాస దీక్షల మాసం రంజాన్ వచ్చేసింది. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం ముస్లింలు సోమవారం (నేడు) నెలవంక దర్శనం చేసుకుని, రాత్రి మసీద్‌లో తరావీహ్‌నమాజ్‌ల ద్వారా మంగళవారం నుంచి రంజాన్ ఉపవాస దీక్షల మాసాన్ని ప్రారంభించుకోనున్నారు. పండుగ ఆరంభాన్ని పురస్కరించుకుని ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అన్ని మసీదులను రంగులు, విద్యుత్ దీపాల అలంకరణలతో ముస్తాబవుతున్నాయి.

- మహబూబాబాద్ (ఆంధ్రజ్యోతి)

వివరాలు 4లో..

రంజాన్ వేళలు	
ఇఫ్తార్ :	
సహర్ :	మంగళవారం ఉ : 5.05 గం..

కమలం చెంతకు సీతారాంనాయక్

- తరుణ్‌చుగ్ నుంచి బీజేపీ సభ్యత్వం స్వీకరణ



బీజేపీ సభ్యత్వం తీసుకుంటున్న సీతారాంనాయక్

వరంగల్ క్రైం, మార్చి 10: బీఆర్ఎస్ మాజీ ఎంపీ సీతారాంనాయక్ ఆదివారం బీజేపీలో చేరారు. ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల పార్టీ ఇన్‌చార్జి తరుణ్‌చుగ్ చేతుల మీదుగా సీతారాంనాయక్ బీజేపీ సభ్యత్వం తీసుకున్నారు. 2014లో బీఆర్ఎస్ నుంచి మహబూబాబాద్ ఎంపీగా సీతారాంనాయక్ పోటీ చేసి విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో సీతారాంనాయక్‌ను కాదని, మాజీ మంత్రి రెడ్యానాయక్ కూతురు కవితకు అవకాశం ఇచ్చారు. ఆ సమయంలో పలు హామీలు ఇచ్చిన బీఆర్ఎస్ అధిష్ఠానం సీతారాంనాయక్‌ను పట్టించుకోలేదు. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికలకు సైతం కవితను పార్టీ అభ్యర్థిగా ప్రకటించింది. దీంతో బీఆర్ఎస్ వైఖరిపై బాహాటంగానే అసంతృప్తిని వ్యక్తం చేసి పార్టీని వీడేందుకు సీతారాంనాయక్ సిద్ధమయ్యారు. ఈ క్రమంలో మూడురోజుల కిందట నగరానికి వచ్చిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి.. సీతారాంనాయక్ నివాసానికి వెళ్లి బీజేపీలోకి ఆహ్వానించారు. కేంద్ర మంత్రి ఆహ్వానం మేరకు ఆదివారం సీతారాంనాయక్ బీజేపీలో చేరారు. కాగా, సీతారాంనాయక్‌కు బీజేపీ అధిష్ఠానం మహబూబాబాద్ లోక్‌సభ టికెట్ హామీ ఇచ్చినట్లు సమాచారం.

వైభవోపేతంగా వసంతోత్సవం

- సోమేశ్వరాలయంలో భక్తిశ్రద్ధలతో వేడుకలు



వసంతోత్సవం నిర్వహిస్తున్న పూజారులు

పాలకుర్తి, మార్చి 10: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి వసంతోత్సవం, డోలారోహణం ఘనంగా నిర్వహించారు. శివపార్వతి, లక్ష్మీనర్సింహస్వామిల కల్యాణోత్సవం ఈనెల 8న రాత్రి నిర్వహించగా నాలుగో రోజు మండల కేంద్రంలోని కల్యాణ మండపంలో డోలారోహణం, వసంతోత్సవం, పుష్పయాగం, సదస్యం, పల్లకి సేవ కార్యక్రమాలను డీవీఆర్ శర్మ, అనిల్, నాగరాజు ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు వైభవోపేతంగా నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి తరలి వచ్చిన భక్తులు వసంతోత్సవాన్ని తిలకించి తన్మయత్వం చెందారు. కార్యక్రమంలో ఈవో లక్ష్మీప్రసన్న, ఆలయ సూపరింటెండెంట్ వెంకటయ్య, కమిటీ సభ్యులు కృష్ణమాచారి, పన్నీరు వెంకన్న, సాగర్, మహేష్, మాజీ చైర్మన్ చిలువేరు కృష్ణమూర్తి, పూజారులు సునిల్, లక్ష్మన్న, శ్రీనివాస్, రాములు, అశోక్, పూజారులు డీవీఆర్ శర్మ, నాగరాజు, సంతోష్, శ్యామ్ పాల్గొన్నారు.

పాపం పసిబిడ్డలు!

- అనుమానాస్పద స్థితిలో ఇద్దరు ఆడపిల్లల మృతి
- తల్లిదండ్రులే చంపినట్లు అనుమానాలు?
- మహబూబాబాద్ జిల్లా అంకన్నగూడెంలో ఘటన



చనిపోయిన ఇద్దరు చిన్నారులు

గార్ల (మహబూబాబాద్ జిల్లా) మార్చి 10 : మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం సీతంపేట గ్రామపంచాయతీ అంకన్నగూడెంలో అనుమానాస్పద స్థితిలో ఇద్దరు ఆడపిల్లలు ఆదివారం మృతి చెందారు. గార్ల, బయ్యారం సీఐ రవికుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అంకన్నగూడెం గ్రామానికి చెందిన పెండగట్ల అనిల్ బయ్యారం మండలం నామాలపాడు చెందిన దేవిని ఐదేళ్ల కిందట ప్రేమవిహం చేసుకున్నాడు. వారికి మూడేళ్ల లాస్య, పదకొండు నెలల వయసున్న జశ్విత ఉన్నారు. అనిల్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తుండగా, భార్య కూలి పనులు చేస్తోంది. శనివారం రాత్రి అందరూ భోజనం చేసి పడుకున్నారు. ఆదివారం తెల్లవారేసరికి ఇద్దరు పిల్లలు మంచంపై విగతజీవులుగా కనిపించారు. అయితే దంపతులు ఇంటికి తాళం వేసి పారిపోయారు. ఆదివారం ఉదయం విషయం గమనించిన అనిల్ తండ్రి వెంకన్న పోలీసులకు సమాచారం అందించారు. సీఐ బి.రవికుమార్, గార్ల ఎస్సై జీనత్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని మంచంపై ఉన్న పాలడబ్బాను, పరిసరాల్లో ఉన్న పురుగుల మందుడబ్బాను స్వాధీనం చేసుకున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఇద్దరు ఆడపిల్లలే కావడంతో పాలల్లో పురుగుల మందు కలిపి చంపి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

ప్రాణాలు పోతున్నా.. పట్టించుకోరా?

విద్యుత్ వ్యవస్థలో కనిపించని భద్రత

- ఏబీ స్విచ్‌లు లేని డీటీఆర్‌లు కోకొల్లలు
- పంటపొలాలపై వేలాడుతున్న వైర్లు
- అన్నదాతకు ఊరూరా ప్రాణగండమే
- సేఫ్టీని పట్టించుకోని విద్యుత్ శాఖ
- గాలిలో కలుస్తున్న ప్రాణాలు

లింగాలఘణపురం, మార్చి10: జిల్లాలో విద్యుత్ వ్యవస్థ మనుషుల భద్రతను గాలికొదిలేసింది. అధికారుల నిర్లక్ష్యం అడుగడుగునా కనిపిస్తోంది. ఏ ఊరుకెళ్లినా.. ఏ లైనును పరిశీలించినా.. నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. అసలే విద్యుత్ ఇప్పుడు రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా మారిపోయింది.. రాజకీయ కోణాలన్నీ విద్యుత్ సరఫరా వైపే దృష్టిసారిస్తున్నాయి తప్ప వాటి నిర్వహణ విషయాన్ని మాత్రం గాలి కొదిలేస్తున్నారు. విరామం లేని విద్యుత్ సరఫరా కావాలని నిలదీస్తున్నారే తప్ప వాటి మెయింటెనెన్స్‌కు అవసరమైన పరికరాల ఏర్పాటును పట్టించుకునే వారు కరువైపోయారు. అధికారులు వందశాతం విద్యుత్ బిల్లుల వసూళ్లపై దృష్టిసారిస్తుండగా పాలకులేమో అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలంటూ హుకుం జారీ చేస్తున్నారు.. ఇక్కడి వరకు బాగానే ఉన్న క్షేత్రస్థాయిలో ఆ ఇద్దరి వ్యవహర కోణాలు అందుకు తగినట్టుగా లేకపోగా కిందిస్థాయి ఉద్యోగులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని క్షణమొక గండంగా వెళ్లదీస్తున్నారు. విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి మొదలు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ వరకు సరఫరా వ్యవస్థలో అడగడుగునా లోపాలు దర్శనమిస్తున్నాయి.



దేవరకుంట తండాలో పత్తిచేనుపై ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ వైర్లు

పంటపొలాలపై వాలిపోతున్న వైర్లు..

జిల్లా వ్యాప్తంగా అనేక గ్రామాల్లో వ్యవసాయరంగానికి చెందిన విద్యుత్ వైర్లు పంటపొలాలపై వాలిపోయి ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. వాటిని సరి చేయాల్సిన అధికారులు తమకేమీ సంబంధం లేనట్లుగా వ్యవహరించడం వల్ల మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. ఇటీవల బండ్లగూడెంలో ఓ రైతుకు చెందిన సుమారు రూ. లక్ష విలువైన కాడెద్దు మేతకోసం వెళ్లి విద్యుత్ వైర్లను తాకడంతో మృత్యువాత పడింది. జిల్లాలోని అనేక చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు లేకపోవడం, గద్దెలు చాలా తక్కువ ఎత్తులో ఉండటం కారణంగా ఓ వైపు పశువులు, మరోవైపు మనుషులు మృత్యువాత పడుతున్నారు.

ఏబీ స్విచ్‌లు లేని డీటీఆర్‌లతో ముప్పు..

జిల్లాలోని 12 మండలాల పరిధిలో వ్యవసాయ రంగానికి సంబంధించిన వేలాది ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నప్పటికీ వాటిలో సగానికిపైగా ఆన్.. ఆఫ్ చేసుకునే ఏబీ స్విచ్(ఎయిర్ బ్రేక్)లు లేవు. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఏదైనా సమస్య వస్తే సరిచేయాలంటే ఆన్-ఆఫ్ స్విచ్ అవసరం . అది ఉంటే సబ్‌స్టేషన్‌లో ఎల్‌సీ(లైన్ కట్) లేకుండానే చిన్న చిన్న మరమ్మతులను ఎక్కడికక్కడ జేఎల్ఎంలు గానీ, లైన్‌మెన్‌లుగానీ సరిచేసుకునే వీలుంటుంది. కానీ ఎక్కువ శాతం ట్రాన్స్‌ఫార్మర్లుకు ఏబీ స్విచ్‌లు లేవు. కొన్ని చోట్ల ఉన్నా అవి పనిచేయడం లేదు. దీంతో ఏ చిన్న సమస్య తలెత్తినా సబ్‌స్టేషన్‌లో ఏఈ అనుమతి ద్వారా ఎల్‌సీ తీసుకోవాల్సి వస్తోంది. హెచ్‌జీ(హారన్ గ్యాప్)ఫ్యూజులు వేయాలన్నా, ఫీడర్ ఫ్యూజులు వేయాలన్నా, లేదా డీటీఆర్ నుంచి వ్యవసాయ కనెక్షన్లకు వెళ్లే ఎల్‌టీ వైర్లు తెగిపోయే ప్రమాదం ఉన్నా, చెట్లు, వాటి కొమ్మలు అడ్డంగా ఉన్నా వాటిని సరిచేసేందుకు ఏబీ స్విచ్‌లు లేకపోవడంతో

మిగతా 6వ పేజీలో



లింగాలఘణపురం మండలం కుందారంలో ఏబీ స్విచ్ లేని ట్రాన్స్‌ఫార్మర్



ఏబీ స్విచ్ పనిచేయకపోవడంతో మృతిచెందిన కాంట్రాక్ట్ ఉద్యోగి మహేందర్‌రెడ్డి(ఫైల్)

ఆరుమాసాల్లోనే మూడు ఘటనలు..

ప్రధానంగా జిల్లాలోని అనేక డీటీఆర్‌లకు ఏబీ స్విచ్ లేకపోవడం వల్ల గడిచిన ఆరుమాసాల్లోనే మూడు చోట్ల ప్రమాదాలు సంభవించాయి. రఘునాథపల్లి మండలం కంచనపల్లి శివారులో కిరణ్ అనే కాంట్రాక్ట్ ఉద్యోగి గత సెప్టెంబరు మాసంలో విద్యుదాఘాతానికి గురై తన రెండు చేతులు కోల్పోయాడు. అదేవిధంగా గత మాసంలో నీర్మాల 33/11కెవీ సబ్‌స్టేషన్‌లో ఎల్‌సీ తీసుకున్నట్లుగా పొరబడ్డ జెఎల్ఎం శ్రీనివాస్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేసే ప్రయత్నంలో విద్యుదాఘాతానికి గురై తన కుడిచేతిని కోల్పోయాడు. తాజాగా లింగాలఘణపురం మండలం వనపర్తిలో రాంగ్ ఎల్‌సీ కారణంగా కట్టర్ వంచ మహేందర్‌రెడ్డి మృత్యువాత పడ్డాడు. కేవలం ఆరు మాసాల వ్యవధిలోనే ఇద్దరు శాశ్వత అంగవైకల్యం, ఒకరు మృతిచెందడం పట్ల క్షేత్రస్థాయి ఉద్యోగుల్లో ఎప్పుడు ఏమవుతుందోననే ప్రాణభయం వెంటాడుతోంది.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం

- డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జనగామ టౌన్, మార్చి 10: ఆర్టీసీ కార్మికులకు 21 శాతం పీఆర్‌సీని ప్రకటించి సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అన్నారు. ఈ విషయంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం జనగామ ఆర్టీసీ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కొమ్మూరి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ కార్మికుల పాత్ర మరువలేనిదన్నారు. వీరిని మాజీ సీఎం కేసీఆర్ అనేకసార్లు పీఆర్‌సీ పేరుతో మోసం చేశారన్నారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. గతంలో 2012లో కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో పీఆర్సీ ప్రకటిస్తే.. మళ్లీ 2024లో సీఎం రేవంత్‌రెడ్డి మాత్రమే ఆర్టీసీ కార్మికులకు పీఆర్‌సీ ప్రకటించారన్నారు. అనంతరం ఆర్టీసీ కార్మికులకు స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, కొమురవెల్లి దేవస్థాన చైర్మన్ లక్ష్మారెడ్డి, మద్దూరు జడ్పీటీసీ గిరికొండల్‌రెడ్డి, నాయకులు బడికె ఇందిరా, వంగాల మల్లారెడ్డి, గంగం నరసింహారెడ్డి, జక్కుల అనితవేణుమాధవ్, బనుక శివరాజ్‌యాదవ్, మేడ శ్రీనివాస్, లింగాల నర్సిరెడ్డి, నూకల బాల్‌రెడ్డి, యాదగిరి, నర్సింగరావు, సిద్ధిరాములు, సిద్ధయ్య, జాఫర్ షరీఫ్, మునిబేగం తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

13 మంది అరెస్ట్ - నగదు, వాహనాలు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం

బచ్చన్నపేట, మార్చి 10: మండలంలోని పోచన్నపేట గ్రామ శివారులో శనివారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేసి 13 మందిని అదుపులోకి తీసుకున్నారు. గ్రామ శివారులో ఓ వ్యవసాయ బావి వద్ద వివిధ ప్రాంతాలకు చెందిన వారు పేకాట ఆడుతున్నట్టు అందిన సమాచారం మేరకు వరంగల్ టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఆదేశాల మేరకు సీఐ కర్ణాకర్, ఎస్ఐ శరత్‌ఆధ్వర్యంలో టీస్క్‌ఫోర్స్ టీం దాడి చేసి వారి వద్ద రూ.1,26,080 నగదు, నాలుగు కార్లు, ఒక ద్విచక్ర వాహనం, 12 మొబైల్ ఫోన్‌లను సీజ్ చేశారు. నిందితులను బచ్చన్నపేట ఎస్ఐ సతీష్‌కు అప్పగించారు. నిందితులలో ఆలేరు, భువనగిరి, పెంబర్తి, జనగాం, సిరిపురం గ్రామాలకు చెందిన వారున్నారు.

50 కిలోల గంజాయి పట్టివేత

వరంగల్ క్రైం, మార్చి 10: హనుమకొండ హంటర్‌రోడ్డులో 50 కిలోల గంజాయి పట్టుకున్నట్లు సమాచారం. ఆదివారం ఒరిస్సా నుంచి పూణెకు ఇద్దరు వ్యక్తులు గంజాయితో వెళుతున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు.. పట్టుకునేందుకు ప్రయత్నించినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న ఇద్దరు వ్యక్తులు వరంగల్ స్టేషన్‌లో దిగి రోడ్డు మార్గాన కాజీపేటకు బయలు దేరినట్లు సమాచారం. గంజాయితో వెళుతున్న ఇద్దరు వ్యక్తులను అనుసరించిన పోలీసులు.. హంటర్‌రోడ్డులోని ఒక మార్ట్ వద్ద పట్టుకున్నట్లు అధికారిక సమాచారం. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారి నుంచి 50కేజీల గంజాయి పట్టుకున్నట్లు తెలిసింది. పోలీసులు అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది.

చైన్ స్నాచింగ్

కరీంనగర్ జిల్లా కండ్లపల్లి గ్రామానికి చెందిన స్వప్న అనే మహిళ పదిరోజుల కిందట కరీంనగర్ వెళ్లేందుకు హనుమకొండ బస్టాండ్‌లో వేచి ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు మెడలోని మూడు తులాల గొలుసును అపహరించుకువెళ్లారు. బాధితురాలు ఆదివారం ఫిర్యాదు చేయగా హనుమకొండ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.



ఆయారే.. రమజాన్

రేపటి నుంచే పవిత్ర ఉపవాస దీక్షలు ప్రారంభం ● నేటి నెలవంక దర్శనం కోసం ఎదురుచూపులు

మహబూబాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఏటేటా మాసం తగ్గుతూ వివిధ రుతువులను స్పృషిస్తూ వచ్చే రంజాన్ మాసం.. ఈ సారి మండుటెండలు దంచి కొడుతున్న మార్చి రెండో వారంలో ఆరంభమవుతోంది. అయినా అంతా అల్లాహ్‌పై భారం వేసుకుని లాలజాన్ని సైతం మింగకుండా కఠోర దీక్షతో సూర్యోదయానికి ముందే ఆరంభించే నెలరోజుల ఉపవాసదీక్షలకు అంతా సన్నద్ధమయ్యారు.

కఠోర ఉపవాస దీక్షలు

ముస్లిం సోదరులు వయో, లింగభేదాలు లేకుండా పాటించే రంజాన్ మాసంలోని కఠోర ఉపవాస దీక్షల వెనుక ఆరోగ్యసూత్రాలు దాగి ఉన్నాయి. సూర్యోదయానికి ముందే తెల్లవారు జామున నిర్ణీత వేళ రంజాన్ క్యాలెండర్ ప్రకారం సహర్ సమయాన భోజనం ముగించుకుని అప్పట్నుంచే ఉపవాస దీక్షలు ప్రారంభిస్తారు. తిరిగి సూర్యాస్తమయం అయ్యాక సాయంత్రం ఇఫ్తార్‌తో దీక్షను డ్రైఫ్రూట్ లేదా పండ్లు, ఫలాలతో విరమిస్తారు. తర్వాత యథావిధిగా భోజనం తీసుకుంటారు. ఏటా రంజాన్ మాసం ఆరంభం ఒకనెల ముందుగా వస్తూ ఉంటుంది. దీక్షా సమయంలో కఠోర నియమాలు పాటించడంతో పాటు ప్రతిరోజు నిత్యం ఐదుసార్లు నమాజ్ చేయడం అనవాయితీగా కొనసాగిస్తారు. ప్రతీ సెకను కూడా అల్లాహ్ నామస్మరణతో తమ విధుల నిర్వహణల్లో నిమగ్నమవుతారు. చంద్రదర్శనాన్ని బట్టి ఈ మాసం 29 లేక 30 రోజుల పాటు కొనసాగుతుంది.

రంజాన్‌లో మనోనిగ్రహం

రంజాన్ పండుగ మాసానికి వెనుక విశిష్ట ప్రాధాన్యత ఉంది. 'రమ్జ్' అంటే అరబిక్ భాషలో 'కాలడం' అని అర్థంగా పెద్దలు విశ్లేషిస్తారు. ఈ నెలరోజుల ఉపవాస దీక్షలో శరీరాన్ని సుష్కింపచేయడం ద్వారా ఆత్మ ప్రక్షాళనతో సర్వపాపాలు సమసిపోతాయని ముస్లింల విశ్వాసం. ఆ క్రమంలోనే అరిషడ్వర్గాలైన కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్స ర్యాలు అదుపులో ఉంటాయని.. దీనికి తోడు మనోనిగ్రహం కలుగుతుందని విశ్వసిస్తారు. ఉపవాస దీక్ష 'రోజా'ను అరబిక్ భాషలో 'సౌమ్', 'సియామ్' అని అంటారు. సౌమ్ అంటే మానుకొనుట, ఆపుట, ఆగుట, కట్టుబడి ఉండుట అనే అర్థాలు వస్తాయి. ఉపవాసిని 'సాయమ్' అని అంటారు. ఇస్లామియా పరిభాషలో ప్రభాత పూర్వసమయం నుంచి సూర్యాస్తమయం వరకు అన్న పానీయాలు త్యజించడం ఈ ఉపవాస దీక్షకు పరమార్థంగా పేర్కొంటారు. ప్రవక్త హజ్రత్ మహ్మద్ ఖర్జూరం పళ్లతోనే ఉపవాస దీక్ష విరమించేవారని విశ్వసించే ముస్లింలు రంజాన్‌లో ఆచరిస్తారు. దివ్య ఖురఆన్ అవతరించిన ఈ మాసంలోనే



హజ్రత్ దావూద్ అలైకు జబూర్ గ్రంథం, హజ్రత్ మూసా అలైకు తౌరాత్ గ్రంథం, హజ్రత్ ఈసా అలైకు బైబిల్ గ్రంథం ప్రసాదించబడిందని నమ్ముతారు.

రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రతి గ్రామంలోనూ రెవెన్యూ ఉద్యోగి ఉండేలా చర్యలు చేపట్టాలి

సీఎంను కోరిన డిప్యూటీ కలెక్టర్ల, రాష్ట్ర తహసీల్దార్ల అసోసియేషన్లు

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థలను బలోపేతం చేయాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని డిప్యూటీ కలెక్టర్ల, రాష్ట్ర తహసీల్దార్ల అసోసియేషన్ల సభ్యులు కోరారు. ఆదివారం డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, కె. రామకృష్ణ, ఎస్.ఆర్ సరిత, తెలంగాణ తహసీల్దార్ల అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.రాములు, రమేశ్ పాక, అసోసియేట్ ప్రెసిడెంట్ పూల్‌సింగ్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. రెవెన్యూ వ్యవస్థ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలు, పూర్వ వీఆర్‌ఓ, వీఆర్‌ఏల పెండింగ్ సమస్యలు, తహసీల్దార్ల అద్దె వాహనాలకు బిల్లుల చెల్లింపు, క్యాడర్ బలోపేతం, తదితర అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత రెవెన్యూ డివిజన్లు, మండలాలు పెరిగినా.. రెవెన్యూ ఉద్యోగుల సంఖ్య పెరగలేదని చెప్పారు. దీంతో ఉన్న ఉద్యోగుల మీదనే పని భారం పడుతోందని, జిల్లాలు, మండలాలు, రెవెన్యూ డివిజన్లకు అనుగుణంగా క్యాడర్‌ను పెంచాలని సీఎంను కోరారు. ప్రతి గ్రామంలోనూ రెవెన్యూ ఉద్యోగి ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. జీఏడీ పరిధిలోని అదనపు కలెక్టర్ల పోస్టుల వ్యవహారాన్ని రెవెన్యూ విభాగ పరిధిలోకి తేవాలని విజ్ఞప్తి చేశారు. అన్ని అంశాలపై సీఎం సానుకూలంగా స్పందించినట్టు అసోసియేషన్ల ప్రతినిధులు తెలిపారు.

నేటి నుంచి లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాలు

- తొలిరోజు పూజల్లో పాల్గొననున్న సీఎం
- పట్టు వస్త్రాలు, తలంబ్రాల సమర్పణ

యాదగిరిగుట్ట, మార్చి 10: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. సోమవారం ఉదయం 10గంటలకు ప్రధానాలయ ముఖ మండపంలో అర్చక, వేదపండితుల బృందం సంప్రదాయరీతిలో లక్ష్మీనృసింహుల తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. తొలిరోజు వైదిక పూజల్లో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనున్నారు. ఆయన సోమవారం ఉదయం 9గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో యాదగిరిగుట్టలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి కాన్వాయ్‌లో కొండపైకి చేరుకుని వీవీఐపీ అతిథి గృహంలో కాసేపు విశ్రాంతి తీసుకుంటారు. 9.30గంటలకు ప్రధానాలయంలో స్వయంభువులను దర్శించుకుంటారు. స్వామి, అమ్మవార్లకు



లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో విద్యుద్దీపాల వెలుగులు

పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవస్థాన అధికారులకు అందజేస్తారు. ఉదయం 11గంటలకు రేవంత్ హెలికాప్టర్‌లో భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయానికి బయల్దేరివెళతారు. సీఎం రేవంత్ పర్యటన నేపథ్యంలో కొండ కింద పాత గోశాల ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న హెలీప్యాడ్ వద్ద పనులను ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఆదివారం పరిశీలించారు. బ్రహ్మోత్సవాల తొలిరోజు పూజల్లో సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి, పలువురు మంత్రులు పాల్గొంటారని అధికారులు పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఈసారి రూ.1.60కోట్లు కేటాయించామని, అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో రామకృష్ణారావు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 18న జరిగే తిరుకల్యాణోత్సవంలో భక్తులు పాల్గొనే విధంగా 600 టికెట్లను విక్రయిస్తామని, ఒక్కో టికెట్ ధర రూ.3వేలని తెలిపారు. కాగా, బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 17న రాత్రి ఎదుర్కోలు, 18న రాత్రి తిరుకల్యాణోత్సవం, 19న రాత్రి దివ్య విమాన రథోత్సవ ఘట్టాలను నిర్వహిస్తారు. ఈ నెల 20న మహాపూర్ణాహుతి, చక్రతీర్థ స్నానం ఉంటుంది. 21వ తేదీన అష్టోత్తర శతఘటాభిషేకం, పండిత సన్మానంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయి.

లోకం తీరు



ఉద్యోగులకు ఏడో గ్యారెంటీ!

(మొదటి పేజీ తరువాయి)

ఇస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగుల డీఏ, పీఆర్సీపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆదివారం ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో ఎంసీహెచ్‌ఆర్డీలో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇన్ని రోజులూ ఆయా ప్రభుత్వ ఉద్యోగ సంఘాలకు గౌరవ అధ్యక్షులుగా ఉన్నది కేసీఆర్ కుటుంబమేనన్నారు. నిర్బంధాలతో పాలన సాగిస్తామనుకోవడం వారి భ్రమ అని, సమస్యలకు చర్చలే పరిష్కారం తప్ప.. నిర్బంధాలు కావని అన్నారు. ప్రభుత్వంపై ఉద్యోగులకు విశ్వాసం కల్పించడానికే చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించామని గుర్తు చేశారు. మంత్రివర్గ ఉపసంఘం శాఖల వారీగా సమావేశం నిర్వహించి నిర్ణయాలు తీసుకుంటుందని, సంఘాలతో చర్చించకుండా నిర్ణయాలు తీసుకోబోమని స్పష్టం చేశారు. ఉద్యోగుల డీఏతో పాటు ఇతర అంశాలపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని, వివిధ శాఖల్లో ఉన్న 1100 మంది రిటైర్డ్ ఉద్యోగుల కొనసాగింపుపైనా త్వరలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలకు ఉచితంగా విద్యుత్తు ఇచ్చే విషయంలోనూ క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కిందిస్థాయి సిబ్బందిని నియమిస్తామని చెప్పారు. ఉద్యోగులకు ఒకటో తారీకునే జీతాలు వేసినా తాము ప్రచారం చేసుకోవడం లేదన్నారు. రోజుకు 18 గంటలు పనిచేస్తూ పాలనను గాడిలో పెడుతున్నామని చెప్పారు.

తెలంగాణ బాపు కేసీఆర్ కాదు..

మాజీ సీఎం కేసీఆర్ తనకు తాను తెలంగాణ బాపుగా చెప్పుకొంటున్నారని, అలా చెప్పుకోవడానికి కనీస పోలిక ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ బాపు, సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ అని, తెలంగాణ ఆత్మను గౌరవించకపోతే సమాజం



మనల్ని క్షమించదని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఆదాయం పడిపోతే.. మద్యంపై వచ్చే ఆదాయంపైనే ఆధారపడేలా కేసీఆర్ పాలన సాగిందని విమర్శించారు. విద్యార్థి, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల పోరాటంతోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని రేవంత్ అన్నారు. రక్తం చిందించకుండా తెలంగాణ సాధించామని కేసీఆర్ పచ్చి అబద్ధాలు మాట్లాడారని విమర్శించారు. కేసీఆర్ కుటుంబంలో ఎవరి రక్తమూ చిందలేదని, కానీ.. కానిస్టేబుల్ కిష్టయ్య లాంటివారు రక్తాన్ని చిందించారని, శ్రీకాంతాచారి లాంటివారు మాంసపు ముద్దలయ్యారని అన్నారు. టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్‌ను శాసన మండలికి తప్పక పంపుతామని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆయన ఎమ్మెల్సీగా ఉంటే శాసనమండలికి గౌరవమన్నారు. ఈ విషయంపై గవర్నర్ తమిళిసైతో మాట్లాడతానన్నారు. ఈ సమావేశంలో మంత్రి డి.శ్రీధర్‌బాబు, కోదండరామ్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

టీచర్లు, ఉద్యోగులలో సంతోషం..

ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో పదేళ్ల తర్వాత ముఖ్యమంత్రి ముఖాముఖి సమావేశం కావడం పట్ల ఆయా సంఘాలు సంతోషం వ్యక్తం చేశాయి. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు ప్రత్యేక చొరవతో ఏర్పాటైన ఈ సమావేశంలో.. ప్రధాన డిమాండ్లను సీఎం దృష్టికి టీజీవోఏ తీసుకెళ్లింది. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏల్లో మూడింటిని ఇవ్వాలని, సీపీఎస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరింది. వీటితోపాటు పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న హెల్త్ కార్డులను వెంటనే ఇవ్వాలని, పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని విన్నవించింది. కాగా, ముఖ్యమంత్రి రెండు గంటలపాటు తమ సమస్యలపై మాట్లాడమే కాకుండా ఎంతో ఓపికగా విన్నారని సంఘాల నేతలు తెలిపారు. గతంలో కనీసం సమస్యలు వినే పరిస్థితి కూడా ఉండేది కాదన్నారు. కాగా, వైద్యశాఖలో పని చేస్తున్న మెడికల్ సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్ అందరినీ బదిలీ చేయాలని మెడికల్ జేఏసీ.. ముఖ్యమంత్రిని కోరింది. ఉస్మానియాకు కొత్త భవనం కట్టాలని, అశాస్త్రీయంగా ఉన్న మెడికల్ కాలేజీల సంఖ్యను తగ్గించాలని సూచించింది. ఆస్పత్రుల్లో విధులకు వచ్చే నర్సులు దుస్తులు మార్చుకునేందుకు కనీసం రూమ్‌లు లేని విషయాన్ని నర్సుల అసోసియేషన్ సీఎం దృష్టికి తీసుకెళ్లింది. ఇక సాధారణ బదిలీలు, పదోన్నతులు, 317 సమస్యను పరిష్కరించాలని, ఉపాధ్యాయ, ఉద్యోగుల సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ పునరుద్ధరణపై ఆయా సంఘాల ప్రతినిధులు సీఎంకు వినతి పత్రం ఇచ్చారు. ప్రధానంగా టీచర్లకు సంబంధించిన మల్టీజోన్, స్పౌజ్ సమస్యలు, స్థానికత, బదిలీలు, ఆరోగ్య బీమా, పెండింగ్ డీఏ లాంటి సమస్యలను వివరించారు. కాగా వినతి పత్రాలను కొన్నింటిని సీఎం నేరుగా తీసుకున్నారు.

సీఎంకు పీఆర్‌టీయూ నేతల కృతజ్ఞతలు

ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించడమే కాకుండా సమస్యల్ని త్వరలోనే పరిష్కరిస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వడం పట్ల పీఆర్‌టీయూ నేతలు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, కమలాకర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

అధికారంలోకి వచ్చిన 72 రోజులకే

31వేల ఉద్యోగాలిచ్చాం

మరో గ్యారెంటీకి శ్రీకారం: పొంగులేటి

మాటిస్తే కాంగ్రెస్ మడమ తిప్పదు: సురేఖ

జీవో 3పై కవిత వ్యాఖ్య విడ్డూరం: సీతక్క

వరంగల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తాము అధికారంలోకి వచ్చిన 72 రోజుల్లోనే 32వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. టీఎస్‌పీఎస్‌సీని ప్రక్షాళన చేసి, యుద్ధప్రతిపాదికన ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం నిరుద్యోగ యువత ఉసురు తీసుకుందని, తాము 11,600 టీచర్ ఉద్యోగాల భర్తీకి మెగా డీఎస్సీ కోసం నోటిఫికేషన్ ఇచ్చామని పేర్కొన్నారు. ఆదివారం హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీలో రూ.68 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు, వరంగల్ నగరంలో రూ.280.85 కోట్లతో చేపట్టిన పనులకు మంత్రులు కొండా సురేఖ, సీతక్కతో కలిసి ఆయన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే నాలుగు పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సోమవారం భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. అర్హులైన పేదలందరికీ సొంతింటి కలను సాకారం చేస్తామని తెలిపారు. ఒకటో తేదీ నుంచి మూడో తేదీలోపు ఉద్యోగులకు వేతనాలు ఇస్తున్న ప్రభుత్వం తమదని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట తప్పదని మంత్రి కొండా సురేఖ అన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని, అందులో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ నగరానికి రూ.260కోట్ల నిధులు కేటాయించారని తెలిపారు. జీవో నంబరు 3కు వ్యతిరేకంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మాట్లాడడం విడ్డూరమని, అసలు ఆ జీవో ఇచ్చిందే కేసీఆర్ ప్రభుత్వమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. తప్పుడు ప్రచారాలు బంద్ చేసి, నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరించాలని సూచించారు.

భట్టి నాకు ద్రోహం చేస్తున్నారు

- ఖమ్మం టికెట్‌ను అడ్డుకుంటున్నారు: వీహెచ్

న్యూఢిల్లీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తనకు ద్రోహం చేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ హనుమంతరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఖమ్మం లోక్‌సభ సీటు తనకు రాకుండా భట్టి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఆదివారం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో విలేకరుల సమావేశంలో వీహెచ్ మాట్లాడారు. 'భట్టిని అప్పట్లో ఎమ్మెల్సీని చేయడంలో నాదే కీలక పాత్ర.. భట్టి ఈరోజు పార్టీలో ఈస్థానంలో ఉండడానికి కారణం నేనే.. 2019 వరకు ఖమ్మంలో ప్రతి కార్యక్రమానికి ఆయన నన్ను రమ్మన్నారు.. ఆ తర్వాత పిలవడం మానేశారు. పనిచేసినోడికి ముఖ్యమంత్రి పదవి రావాలని నేను అన్నందుకే నాపై కక్ష కట్టారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ పార్టీ కోసం చాలా కష్టపడ్డారని చెప్పారు. 'రాహుల్‌ఖమ్మం నుంచి పోటీ చేస్తే నేను తప్పుకుంటా.. లేదంటే ఆ సీటుకు నేను అన్నివిధాల అర్హుడిని.. ఖమ్మం టికెట్ ఇస్తే భారీ మెజారిటీతో గెలుస్తా.. పదవి ఉన్నా లేకపోయినా చనిపోయేవరకు కాంగ్రెస్‌లోనే ఉంటా.. చనిపోయిన తర్వాత పార్టీ జెండా నాపై ఉంటుంది' అని వ్యాఖ్యానించారు.

వీహెచ్‌కు ఖమ్మం టికెటిస్తే కలిసికట్టుగా గెలిపిస్తాం

- నేను అడ్డుపడడం..ఆయన అపోహ: భట్టి

చింతకాని, మార్చి 10: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపికలో కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీదే తుది నిర్ణయమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆ కమిటీ నిర్ణయం మేరకే అభ్యర్థుల ఎంపిక ఉంటుదని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో పర్యటించిన భట్టి.. ఎంపీ టికెట్ల కేటాయింపు విషయమై పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. పార్టీ అధిష్ఠానం వీహెచ్‌కు ఖమ్మం ఎంపీ టికెట్ ఇస్తే జిల్లా మంత్రులు, నాయకులు, కార్యకర్తలు.. అందరం కలసికట్టుగా పనిచేసి గెలిపించుకుంటామని చెప్పారు. ఖమ్మం ఎంపీ టికెట్ వీహెచ్‌కు రాకుండా తాను అడ్డుపడటం లేదని.. అది కేవలం ఆయన అపోహ మాత్రమేనన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడిగా వీహెచ్‌కు తన పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుతో పాటు రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే తమ తక్షణ కర్తవ్యమన్నారు. లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక విషయంలో అధిష్ఠానం నిర్ణయానికి తామంతా కట్టుబడి ఉంటామని తెలిపారు.

మాకు న్యాయం చేయండి

- 317 జీవో వల్ల బాధితులుగా మారాం
- మంత్రి దామోదరను కలిసిన నర్సులు

గత సర్కారు హయాంలో విడుదల చేసిన జీవో నంబరు 317 వల్ల తాము బాధితులుగా మారామని, తమకు న్యాయం చేయాలని కోరుతూ నర్సులు వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఆదివారం ఆయన నివాసంలో కలిశారు. తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందజేశారు. గత ప్రభుత్వం నిరంకుశంగా జోనల్ వ్యవస్థను తీసుకొచ్చి తమ జీవితాలతో చెలగాటం ఆడుకుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 317జీవోపై క్యాబినెట్ సబ్ కమిటీలో చర్చించి, అందరికీ న్యాయం చేస్తామని మంత్రి ఉద్యోగులకు భరోసానిచ్చారు.

పేదింటి పండుగ

నేడు 'ఇందిరమ్మ ఇల్లు' పథకం ప్రారంభించనున్న సీఎం రేవంత్

హైదరాబాద్, ఖమ్మం/భద్రాచలం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పేదవాడి సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. "ఇందిరమ్మ ఇల్లు" పథకం కార్యరూపం దాల్చనుంది. రాముల వారు కొలువైన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం భద్రాచలంలో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ ప్రాంగణం దీనికి వేదిక కానుంది. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఇందిరమ్మ ఇల్లు ఐదోది. అధికారంలోకి వచ్చాక మూడు నెలల్లో నాలుగు పథకాలను అమలు చేసింది. కాగా, ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సంబంధించి మూడు నమూనాలను కూడా సోమవారం ప్రకటించనున్నారు. పథకం అమలుకు అవసరమైన మార్గదర్శకాలను సర్కారు సిద్ధం చేసింది. ఇల్లు లేని అర్హులైన పేదలందరికీ దశలవారీగా వర్తింపజేయనున్నారు. స్థలం ఉన్నవారికి రూ.5 లక్షలు, లేనివారికి స్థలం ఇచ్చి రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేయనున్నారు. ఈ మొత్తాన్ని నాలుగు దశల్లో మంజూరు చేస్తారు. ఈ ఏడాదిలో నియోజకవర్గానికి 3,500 చొప్పున 119 నియోజకవర్గాలకు 4,16,500 ఇళ్లను మంజూరు చేయగా.. రిజర్వ్ కోటా (సీఎం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పరిధి)లో మరో 33,500 కేటాయించారు. మొత్తంగా 4.50లక్షల ఇళ్లు మంజూరు కానున్నాయి. తొలి దశలో సొంత స్థలం ఉన్నవారికి అందనుండగా.. స్థలం లేనివారికి రెండో దశలో పథకాన్ని వర్తింపజేస్తారు. ఇంటి నిర్మాణం విషయంలో లబ్ధిదారుదే పూర్తి నిర్ణయం అయినప్పటికీ.. ఆర్‌సీసీ స్ట్రక్చర్‌తో పాటు కచ్చితంగా వంట గది, బాత్‌రూమ్ ఉండాలి. అనంతరం 'ఇందిరమ్మ ఇల్లు' పథకం కింద నిర్మించినదని తెలిసేలా 'అభయహస్తం' లేదా ప్రత్యేకంగా తయారు చేసే కొత్త లోగోను ఉంచనున్నారు. కాగా బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాల విషయంలో చేసిన తప్పులు ఈసారి జరగకుండా, అర్హులకే పథకం అందేలా మార్గదర్శకాలను ఖరారు చేశారు. ఈ పథకానికి అర్హులైన వారు దాదాపు 30-40 లక్షలమంది ఉండొచ్చని ప్రభుత్వం అంచనా వేస్తోంది. 'ప్రజాపాలన' దరఖాస్తుల ఆన్‌లైన్ పూర్తయ్యాక హెచ్చుతగ్గులు ఉండొచ్చని కూడా భావిస్తోంది. దరఖాస్తులన్నింటినీ క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు అవసరమైతే గ్రామసభల్లోనూ మరోసారి పరిశీలించనున్నారు. గ్రామసభల్లో వివరాలను నమోదు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఒక ప్రొఫార్మాను రూపొందించింది.



పథకం కోసం రుణం..

ఇందిరమ్మ ఇల్లు పథకం కోసం రాష్ట్ర ప్రభుత్వం హడ్కో నుంచి రూ.3 వేల కోట్ల రుణం తీసుకోనుంది. ఎన్ని ఇళ్లను ఏయే దశల్లో నిర్మిస్తామనే వివరాలను కూడా తెలిపింది. తొలి శలో గ్రామీణ ప్రాంతాల్లో 57,141, పట్టణాల్లో 38,094 ఇళ్లను నిర్మిస్తామని పేర్కొంటూ ఈ నె 5న జీవో విడుదల చేసింది. దీని ప్రకారం నియోజకవర్గానికి 800 ఇళ్లు అందనున్నట్టు తెలుస్తోంది. ఈ గణాంకాలు, అంచనాలు హడ్కో రుణం కోసం సంబంధించినవేనని సమాచారం. వీటికి మరికొన్ని కలిపి ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయనుంది. 'ఇందిరమ్మ ఇల్లు' పథకాన్ని మహిళ పేరు మీద అందిస్తారు. ప్రత్యేక పోర్టల్ ద్వారా నిర్మాణాలను పర్యవేక్షిస్తారు. లబ్ధిదారుకి రేషన్ కార్డు కచ్చితంగా ఉండాలి. గతంలో ఇందిరమ్మ ఇల్లు పొంది ఉంటే అనర్హులు. మంజూరైన ఇళ్ల కంటే లబ్ధిదారులు ఎక్కువ ఉంటే.. వారికి మరో విడతలో అందిస్తారు.

సీఎం భద్రాచలం పర్యటన షెడ్యూల్ ఇది..

సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం 12:10 గంటలకు భద్రాచలం రాముడిని దర్శించుకోనున్నారు. 1:30కు వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటుచేసిన సభలో 'ఇందిరమ్మ ఇల్లు' పథకాన్ని ప్రారంభిస్తారు. 2:30 నుంచి 3:30 మధ్య భద్రాచలం ఆలయం, సాగునీటి, దేవాదాయ శాఖ అధికారులతో సమావేశమై సీతారామ, సీతమ్మసాగర్ ప్రాజెక్టుల పనుల పురోగతిపై సమీక్షిస్తారు. సాయంత్రం 4 గంటలకు మణుగూరులో సభకు హాజరవుతారు. 6:10 గంటలకు హైదరాబాద్‌కు తిరిగి చేరుకుంటారు.

భద్రాచలం రామాలయం అభివృద్ధిపై ఆశ

హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా భద్రాచలం వచ్చిన రేవంత్.. అధికారంలోకి వస్తే ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సీఎం హోదాలో ఇప్పుడు భద్రాద్రి అభివద్ధికి వరాలు ప్రకటిస్తారని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం భద్రాచలం అభివృద్ధికి రూ.100కోట్లు ప్రకటించినా రూపాయి ఇవ్వలేదు.

అప్పుల రాష్ట్రాన్ని అప్పగించినా హామీలు నెరవేరుస్తున్నాం: తుమ్మల



ఖమ్మంకార్పొరేషన్: ప్రజల సొమ్ము దోచుకోవటమే ధ్యేయంగా పనిచేసిన గత ప్రభుత్వం తమకు అప్పుల రాష్ట్రాన్ని అప్పగించినా సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో సాహసంతో ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా బూడిదెంపాడు వద్ద రూ.38.50 కోట్లతో ఖమ్మం-ఇల్లెందు రెండులైన్ల రహదారి నాలుగులైన్లుగా విస్తరణ, అభివృద్ధి పనులకు ఆదివారం మంత్రి శంకుస్థాపన చేశారు. సోమవారం భద్రాద్రి రాముడి సన్నిధిలో సీఎం రేవంత్‌రెడ్డి ఐదో గ్యారెంటీగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభిస్తారన్నారు. శ్రీశైలం, సాగర్‌లో నీళ్లు లేకపోవడానికి బీఆర్ఎస్ ప్రభుత్వ తప్పిదాలే కారణమన్నారు.

బడుల్లో మార్పు రావాల్సిందే!

- మౌలిక సదుపాయాలు కల్పించండి
- సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పూర్తి చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో స్పష్టమైన మార్పు కనిపించాలని.. వాటిపై ప్రజలకు నమ్మకం కలిగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్కారీ బడులు, కళాశాలలకు తక్షణమే ఉచిత విద్యుత్ అమలయ్యేలా చూడాలన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై ఆదివారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో ఆయా శాఖల ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష జరిపారు. విద్యార్థులకు యూనిఫామ్‌తో పాటు.. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటు, పర్యవేక్షణ బాధ్యతలను స్వయం సహాయక మహిళా సంఘాలకు అప్పగించే అంశాన్ని పరిశీలించాలన్నారు. ఇతర రాష్ట్రాల ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి వాటిని రాష్ట్రంలో అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతి గదులు ఏర్పాటు చేసి.. టీ-శాట్ ద్వారా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో డిజిటల్ పాఠాలు అందించాలని, బడులపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుపై దృష్టిసారించాలని, సీఎస్ఆర్ ఫండ్స్ కోసం ప్రయత్నం చేయాలని, సౌకర్యాలను మెరుగుపరచేందుకు ఎన్నారైల సహకారం తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలన్నారు. స్కిల్ యూనివర్సిటీ కోసం ఐఎస్‌బీ తరహాలో గవర్నింగ్ బాడీని ఏర్పాటు చేయాలన్నారు. న్యాక్‌పై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలన్నారు. సచివాలయం నుంచి కిందిస్థాయి వరకూ ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టం (ఎఫ్‌ఆర్‌ఎస్) తీసుకువచ్చే అంశంపై సీఎం చర్చించారు. సమీక్షలో మంత్రి శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎస్ శాంతికుమారి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే సర్కారు లక్ష్యం

(3వ పేజీ తరవాయి)

సహకారంతో వరంగల్ తూర్పు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుంచుతానన్నారు. రానున్న మూడేళ్లలో వరంగల్ మహానగరాన్ని అభివృద్ధితో కూడిన హరితనగరంగా అభివృద్ధి చేస్తామన్నారు. విశాలమైన రోడ్లు, జంక్షన్‌లు తదితర అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు, డాక్టర్ నెహ్రూనాయక్, మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్లు చింతాకుల అనిల్ కుమార్, కాంగ్రెస్ నాయకుడు మీసాల ప్రకాష్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి పాల్గొన్నారు.

వెండి తెరపై తండా బిడ్డలు

భీమా సినిమాలో మెప్పించిన మైలారం సోదరులు



భీమా సినిమాలో నటించిన రాము, లక్ష్మణ్

పాలకుర్తి, మార్చి 10: చిన్నప్పటి నుంచి సినిమాల్లో నటించాలని కలలు కన్నారు. అక్కడికి ఎలా వెళ్లాలో తెలియక సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకున్నారు. పలు వీడియోలు తీసి యూట్యూబుల్లో అప్లోడ్ చేసి ప్రశంసలు అందుకున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చేసి ఫాలోవర్స్‌ను పెంచుకున్నారు. తర్వాత లఘు చిత్రాలు తీయడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో సినిమా డైరెక్టర్లు, నిర్మాతల దృష్టిని ఆకర్షించారు. గోపీచంద్ హీరోగా నటించిన భీమా సినిమాలో చిన్ననాటి గోపీచంద్ పాత్రలో అన్నదమ్ములుగా ఇద్దరు నటించారు. రామా పాత్రలో రాము, భీమా పాత్రలో లక్ష్మణ్ నటించి ఆకట్టుకున్నారు జనగామ జిల్లా పాలకుర్తి మండలం మైలారం గ్రామానికి సోదరులు. తాజాగా విడుదలై విజయవంతంగా ప్రదర్శితమవుతున్న ఈ సినిమాలో ఇద్దరు నటించడం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పలు సినిమాల్లో అవకాశాలు..

గుగులోతు శిరీష, ఠాకూర్ దంపతుల సంతానమైన రాము, లక్ష్మణ్ వంశీధర్ భోగరాజు దర్శకత్వంలో విడుదలైన 'గుండె కథ వింటారా?' అనే సినిమాలో తొలిసారిగా వెండి తెరపై కనిపించారు. తమిళ హీరో నటించిన సార్ సినిమాలో గ్రామీణ విద్యార్థుల పాత్రలో ఒదిగిపోయారు. 'నా అడ్డ' సినిమాలో బాల విలన్లుగా నటించి మెప్పించారు. భీమా సినిమాలో మూడు నిమిషాల నిడివి గల పాత్రలో అబ్బురపరిచారు. వీరు మరింత ఉన్నత స్థానానికి చేరుకోవాలని గ్రామస్థులు ఆశీర్వదిస్తున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా ప్రశంసిస్తున్నారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?

(3వ పేజీ తరువాయి)

సబ్‌స్టేషన్‌లో ఎల్‌సీలు తీసుకోవాల్సిన అవశ్యకత ఏర్పడుతోంది. పైగా ఇటీవలే జరిగిన విద్యుత్ ఉద్యోగుల బదిలీల కారణంగా ఏ యే ఫీడర్లు ఏయే డీటీఆర్ పరిధిలోకి వస్తాయో తెలియని అయోమయంలో తప్పుడు ఎల్‌సీ తీసుకుని సిబ్బంది విద్యుత్ షాక్‌లకు గురవుతున్నారు.

చెట్ల కొమ్మల్లో అల్లుకుంటున్న విద్యుత్ తీగలు..

జిల్లాలోని అనేక గ్రామాల్లో విద్యుత్ వైర్ల కింద ఉన్న చెట్లను తొలగించకపోవడంతో విద్యుత్‌తీగలు, కంపచెట్లు వాటి కొమ్మలు అన్నీ కలగలిసి ఉంటున్నాయి. దీంతో వ్యవసాయ అవసరాల కోసం, పశువుల జాడ కోసం చెట్లపొదల్లోకి వెళ్లే రైతులు ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం ఉన్నప్పటికీ విద్యుత్ అధికారులు పట్టించుకునే పాపాన పోవడం లేదు.

క్షేత్రస్థాయిలో సిబ్బంది కొరత..

విద్యుత్ సంస్థ నిబంధనల ప్రకారం ప్రతీ 750 సర్వీసులకు ఒక ఉద్యోగి అవసరం ఉండగా 2500 సర్వీసులకు కూడా ఒక్కరు కూడా లేకపోవడం గమనార్హం. ముగ్గురు ఉద్యోగులు చేసే పనిని ఒక్కరు మాత్రమే చేస్తున్నందున పనిభారం విపరీతంగా పెరిగిపోతోంది. ఒక సాధారణ గ్రామాన్ని పరిశీలిస్తే 4500 సర్వీసులు ఉంటుండగా అక్కడ సంస్థ నిబంధనల ప్రకారం ఆరుగురు ఉద్యోగులు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. కానీ వాస్తవంగా అక్కడ కేవలం ఒక జెఎల్‌ఎం, లైన్‌మన్ మినహా ఎవ్వరు కూడా ఉండటం లేదు. అయితే లైన్‌మన్, జెఎల్‌ఎం జాబ్‌చార్ట్‌ల ప్రకారం సంబంధిత ఉద్యోగులు కేవలం విద్యుత్ సరఫరాకు సంబంధించిన పనులను మాత్రమే చూసుకోవాల్సి ఉంటుంది. కానీ ఇటీవల కాలంగా బిల్లులు వసూలు చేసే పనుల నుంచి మొదలు పెడితే సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్ విధులను కూడా వాళ్లతోనే చేయిస్తుండటం గమనార్హం.

'బీజేపీ సంకల్ప సమ్మేళనానికి తరలిరండి'

చిలుపూర్, మార్చి 10: ఈ నెల 12న హైదరాబాద్‌లో నిర్వహించే బీజేపీ విజయ సంకల్ప సమ్మేళనానికి శ్రేణులు పెద్దఎత్తున తరలిరావాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు గంటె ఉపేందర్ యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన చిలుపూర్ మండల కేంద్రంలో బూత్ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరవుతున్న ఈ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు తోట శ్రీనివాస్, శక్తి కేంద్ర ఇన్‌చార్జీలు వెలిశాల శ్రీనివాస్, కందుకూరి రజనీకర్, తోట రంజిత్, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జర గాడీ రోకోనా..!

ఘన్‌పూర్‌లో రైళ్ల హాల్టింగ్‌కు డిమాండ్ ● ఏళ్లుగా కోరుతున్నా పట్టించుకోని రైల్వే శాఖ ● ఇబ్బందులు పడుతున్న ప్రజలు



స్టేషన్‌ఘన్‌పూర్ రైల్వే స్టేషన్

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, మార్చి 10: వ్యాపార, విద్యా కేంద్రంగా విలసిల్లుతున్న స్టేషన్‌ఘన్‌పూర్ 2016లో డివిజన్ కేంద్రంగా అవతరించింది. ఇప్పటికి 8 ఏళ్లయినా ఇంత వరకు ప్రజలు కోరుతున్న రైళ్ల హాల్టింగ్ కల నెరవేరలేదు. ప్రజలు, ప్రయాణికుల అవసరాల దృష్ట్యా పలు రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని ఎన్నో ఏళ్లుగా స్థానికులు కోరుతున్నారు. ఇటీవల రైల్వే శాఖ ఏపీ, తెలంగాణలో పలు రైళ్లకు పలు స్టేషన్‌లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించింది. వాటిలో స్టేషన్‌ఘన్‌పూర్ రైల్వేస్టేషన్ లేక పోవడంతో ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో ముఖ్యమైన రైళ్లకు హాల్టింగ్ లేకపోవడంతో స్థానికులతో పాటు, చుట్టు పక్కల మండలాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం స్టేషన్‌లో భాగ్యనగర్, గోల్కొండ, కృష్ణా, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, కాకతీయ, పుష్‌పుల్ రైళ్లకు మాత్రమే హాల్టింగ్ ఉంది. ఇవి ఏ మాత్రం ప్రయాణికుల అవసరాలను తీర్చలేకపోతున్నాయి. అదనంగా పద్మావతి, గౌతమి, శాతవాహన, సికింద్రాబాద్- మచిలీపట్నం, దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. ఇందుకోసం ఎన్నో ఏళ్లుగా ప్రయత్నిస్తున్నారు. సుమారు 30 ఏళ్ల నుంచి కనిపించిన ప్రతీ రైల్వే శాఖ అధికారికి, ప్రజాప్రతినిధికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, రైల్వే జీఎంలు, మంత్రులు, రాజకీయ పార్టీల నాయకులకు వినతి పత్రాలు ఇస్తున్నారు. చేస్తాం.. చూస్తాం.. అంటున్నారే తప్ప ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదు. అదనంగా రైళ్ల హాల్టింగ్ ద్వారా ఆదాయం పెరగడంతో పాటు ప్రయాణికులకు రవాణా సౌకర్యం మెరుగవుతుందని ప్రజలు చెబుతున్నారు. ప్రధానంగా ఘన్‌పూర్, చిలుపూర్, జఫర్‌గడ్, పాలకుర్తి తదితర మండలాల ప్రజలు స్టేషన్‌ఘన్‌పూర్ రైల్వే స్టేషన్ నుంచే ప్రయాణం చేస్తుంటారు. వ్యాపారులు, విద్యార్థులు, ఉద్యోగులు, తీర్థయాత్రలు చేసే వారు ఇక్కడనే రైళ్లను ఆశ్రయించి ప్రయాణం కొనసాగిస్తుంటారు. పవిత్ర పుణ్యక్షేత్రం తిరుపతి వెళ్లాలంటే ఉదయం 8 గంటలకు కృష్ణా ఎక్స్‌ప్రెస్ తప్ప ఇక ఏ రైలు లేదు. పైగా ఈ రైలులో వెళ్లడానికి ప్రయాణికులు మొగ్గు చూపడం లేదు. కాజీపేట, వరంగల్‌కు వెళ్లి పద్మావతి, నారాయణాద్రి తదితర రైళ్లలో వెళ్లడానికి ఇష్టపడుతున్నారు. తిరుపతి వెళ్లడానికి పద్మావతి రైలుకు హాల్టింగ్ ఇవ్వాలని డిమాండ్ అధికంగా వినిపిస్తున్నది. మిగతా రైళ్లు కూడా ఆపడానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలి..

వై.ప్రభాకర్, శివునిపల్లి



స్టేషన్ ఘన్‌పూర్ ఎన్నో దశాబ్దాల కాలం నుంచి వ్యాపార కేంద్రంగా ఉంది. అయినా రైళ్ల హాల్టింగ్ లేక దూర ప్రాంతాలకు వెళ్లాలంటే ప్రయాణికులు కాజీపేట్, సికిందరాబాద్ వెళ్లి ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఎక్కాల్సి వస్తున్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్‌కు చర్యలు తీసుకోవాలి.

ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు..

కె.యాదగిరి, స్టేషన్ ఘన్‌పూర్



ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ కోసం ఎంతో కాలంగా ఎదురు చూస్తున్నాం. ఏండ్లు గడుస్తున్నాయే తప్ప పని కావడం లేదు. అధికారులతో పాటు ప్రజాప్రతినిధులకు సైతం ఎన్నో సార్లు వినతి పత్రాలు ఇచ్చాం. పెరిగిన జనాభా నేపథ్యంలో ఇప్పటికైనా రైల్వే శాఖ రైళ్ల హాల్టింగ్‌కు చర్యలు తీసుకోవాలి.

విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలి

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ● ఘనంగా ఏకశిల పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

జనగామ కల్చరల్, మార్చి 10: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకొని వాటి సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఏకశిల బీఈడీ కళాశాల ప్రాంగణంలో ఏకశిల పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవం నిర్వహించారు. 'ఉడాన్' (రెడీ టు రైజ్) పేరుతో నిర్వహించిన కార్యక్రమానికి కళాశాల కరస్పాండెంట్ సి.ఉపేందర్‌రెడ్డి అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏకశిల పబ్లిక్ స్కూల్ ఉన్నత విద్యావంతుల వేదికగా నిలిచిందన్నారు. విద్యార్థులు ఉన్నత విద్యావంతుల స్ఫూర్తితో రాణించాలన్నారు. కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకొని పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు ఎంత చెప్పామనే భావన వీడనాడి వారికి ఎంత అర్థమైందనే దాని పై దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థులు ఇంగ్లీష భాషపై పట్టు సాధించాలన్నారు. పెరిగిన సాంకేతికత మూలంగా పిల్లలు సెల్‌ఫోన్లకు బానిసలుగా మారుతున్నారని, పరీక్షా సమయంలో విద్యార్థులు సెల్‌ఫోన్లకు, టీవీలకు దూరంగా ఉండాలన్నారు. అప్పుడే అనుకున్న లక్ష్యాలు సాధించగలుగుతారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లాను పాఠశాల యాజమాన్యం శాలువాతో ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సి.ఇందిర, మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున లింగయ్య, ఇప్రభాకర్‌రెడ్డి, కన్నా పరశురాములు, కౌన్సిలర్లు అనిత, స్వరూప, లక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

సీపీఐ నేతకు ప్రజాసంఘాల నివాళి

జఫర్‌గడ్, మార్చి 10: పేదల కోసం అహర్నిషలు పోరాడిన బొమ్మినేని వెంకట్‌రెడ్డి ఆశాయాలను కొనసాగిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి సిహెచ్.రాజారెడ్డి అన్నారు. మండలంలోని రఘునాథ్‌పల్లికి చెందిన సీపీఐ జిల్లా నేత, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మినేని వెంకట్‌రెడ్డి మృతి చెందడంతో ఆదివారం రాజారెడ్డితో పాటు జిల్లా సహాయ కార్యదర్శులు ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్, హన్మకొండ జిల్లా నేతలు మోతె లింగారెడ్డి, నేదునూరి రాజమౌళి, న్యాయవాది బీమనాథం శ్రీనివాస్, మండల కార్యదర్శి జువారి రమేశ్, తదితర నేతలు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెంకట్‌రెడ్డి పార్టీ, అనుబంధ ప్రజా సంఘాల నిర్మాణం, వాటి పటిష్టత కోసం పాటుపడ్డారన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఆయన ఆశయాల సాధన కోసం ప్రతీ కార్యకర్త పోరాటం సాగించాలని నేతలు కోరారు. నివాళులు అర్పించిన వారిలో సీపీఐ, అనుబంధ ప్రజా సంఘాల రాష్ట్ర, జిల్లా, మండల నేతలు మండల గట్టుమల్లు, జనార్దన్, బిళ్ల తిరుపతిరెడ్డి, ఆరెల్లి రవి, ఎండి.యాకూబ్‌పాషా, కూరపాటి చంద్రమౌళి, కావటి యాదగిరి, తోట రమేశ్, సత్తయ్య, బుచ్చయ్య, యాదగిరి, రాజు, ముసలయ్య, పెండ్యాల సమ్మయ్య, తదితర నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు. కాగా, వెంకట్‌రెడ్డి అంత్యక్రియలు ఆదివారం మండలంలోని రఘునాథ్‌పల్లిలో జరిగాయి.

సావిత్రిబాయి పూలేకు నివాళి



పాలకుర్తిలో పూలే చిత్రపటం వద్ద బీసీ సంఘం నాయకుల నివాళి

పాలకుర్తి, మార్చి 10 : సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే 127వ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నియోజకవర్గ నాయకుడు పులి గణేష్ మాట్లాడుతూ దేశంలో తొలి ఉపాధ్యాయురాలిగా సావిత్రిబాయి పూలే పని చేశారని అన్నారు. సమాజంలో మూఢ విశ్వాసాలు, సాంఘీక దురాచారాల పట్ల చైతన్యం చేసిన గొప్ప సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే అని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు సలేంద్ర శ్రీనివాస్, సాయి సందీప్, లెనిన్, జమాలోద్దిన్, వీరన్న, మాదరాజు యాకయ్య, భాస్కరాచారి, రాపాక రాము, తాడూరు రాము పాల్గొన్నారు.

నేడు ఆలీంపూర్ పరిధిలో విద్యుత్ బంద్

బచ్చన్నపేట, మార్చి 10: ఆలీంపూర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ రాజ్‌కుమార్, లైన్‌మెన్ వెంకట నర్సింహారెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్టు వివరించారు.

బ్యాండ్ కళాకారులకు గుర్తింపు కార్డులు

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 10: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బ్యాండ్ వాయిద్య కళాకారులకు ప్రభుత్వమందించిన గుర్తింపు కార్డులను ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ రహీం పాషా అందజేశారు. ఆదివారం మండలంలోని సముద్రాల గ్రామంలో మాట్లాడారు. జిల్లాలో మొత్తం 800 మంది కళాకారులుండగా, ప్రభుత్వం మొదటి దఫాలో 250 కార్డులను అందజేసిందని, కార్డులు పొందిన కళాకారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. మిగతా వారికి సైతం త్వరలోనే కార్డులు అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో చాట్ల సుధాకర్, అఫ్జల్ మియా, పరశరాములు, అన్నెపు రాజు, గౌస్, ఖాదర్, రఫీ, ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

సమావేశాన్ని జయప్రదం చేయండి

మత్స్య కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 10: జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించే మత్స్యకారుల సంఘం రాష్ట్ర స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని మత్స్య కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగెల రమేష్ పిలుపునిచ్చారు. ఆదివారం స్టేషన్‌ఘన్‌పూర్‌లో నిర్వహించిన మత్స్యకారుల మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో మత్స్యకారులకు ప్రాధాన్యతనివ్వాలని, ఉచిత చేపపిల్లలకు బదులుగా సొసైటీలకు నగదును బదలాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వడవల్లి రాజు, చొప్పరి భిక్షపతి, గోనెల వెంకన్న, నాయిని రామస్వామి, కండ్లకోలు కిషన్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న మాస్టర్ ట్రైనర్ క్యాస్మి

జనగామ టౌన్, మార్చి 10: హజ్ యాత్రకు వెళ్లే వారికి హజ్ సొసైటీ కన్వీనర్ ముజాహిద్ ఉద్దీన్, సాధిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జనగామలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్ మజహర్ క్యాస్మి మాట్లాడుతూ.. హజ్‌కు బయల్దేరే సమయం నుంచి తిరిగి ఇంటికి వచ్చే వరకు హజ్‌లో నిర్వహించాల్సిన ముఖ్యమైన విషయాలను వివరించారు. సౌదీ అరేబియాలోని మక్కా, మదీనాలో అనుసరించాల్సిన నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. అనంతరం హజ్ యాత్రికుల శిక్షణ క్యాంపు నిర్వహణలో సేవలందించిన మహ్మద్ ఎజాజుద్దీన్‌ను హజ్ సొసైటీ నిర్వాహకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో 28వ వార్డు కౌన్సిలర్ సమద్, హజ్ నిర్వాహకులు హఫీజ్, మతిన్ అత్తర్, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కోమల్ల యువకుడికి బంగారు పతకం



బంగారు పతకంతో తాటికొండ వేణు

రఘునాథపల్లి, మార్చి 10: మండలంలోని కోమల్ల గ్రామానికి చెందిన తాటికొండ వేణు యాదవ్ బంగారు పతకం సాధించాడు. తెలంగాణ హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా పైడిపల్లిలో ఈ నెల 8 నుంచి 10వ తేది వరకు 45వ రాష్ట్ర స్థాయి ఇంటర్ డిస్ట్రిక్ జూనియర్ బాలుర హ్యాండ్ బాల్ పోటీలు జరిగాయి. తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాలకు చెందిన పది జట్లు పాల్గొనగా వేణు ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు తరఫున ఆడాడు. ఆదివారం పోటీలు ముగిశాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు ప్రథమ బహుమతితో పాటు షీల్డు అందుకుంది. జట్టులో అసమాన ప్రతిభ కనబర్చిన వేణు బంగారు పతకం అందుకున్నాడు. ఈ సందర్భంగా వేణు యాదవ్‌ను ఎంపీపీ మేకల వరలక్ష్మినరేందర్‌తో పాటు గ్రామస్థులు అభినందించారు.

విజయ డెయిరీ మండల అధ్యక్షుడి ఎన్నిక



సాదం రమేష్

చిలుపూర్, మార్చి 10: విజయ డెయిరీ చిలుపూర్ మండల సొసైటీ అధ్యక్షుడిగా కృష్ణాజీగూడెంనకు చెందిన సాదం రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం చిలుపూర్ గుట్టలో వివిధ గ్రామాలకు చెందిన సొసైటీ అధ్యక్షులు సాదం రమేష్‌ను ఎన్నుకున్నారు. అనంతరం పూర్తి స్థాయి కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షునిగా వెంకటాద్రి, కార్యదర్శిగా కాసాని నాగరాజుతో పాటు, సభ్యులుగా లకావత్ శ్రీనివాస్, పులి సంపత్, బర్మ రవి, భూక్య శ్రీనివాస్, నిమ్మ సౌజన్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, విజయ డెయిరీ పాల ఉత్పత్తిదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

కుందూరు.. వెంటనే పదవికి రాజీనామా చేయ్

కొడకండ్ల, మార్చి 10: డీసీసీబీ వైస్‌చైర్మన్ పదవి అనుభవిస్తూ కాంగ్రెస్‌లో చేరిన కుందూరు వెంకటేశ్వర్‌రెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సింధె రామోజి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మండలకేంద్రంలో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉండగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు దయతో కోట్లాది రూపాయల విలువైన కాంట్రాక్ట్ పనులు చేసి ఆర్థికంగా లాభం పొందడమే కాకుండా డీసీసీబీ వైస్‌చైర్మన్‌గా పదవి అనుభవించి పార్టీ మారడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అందె యాకయ్య, రాము, గాంధీనాయక్, మధుసూదన్, వెంకటనారాయణ, డి.వెంకటేశ్వర్‌రావు, మంగ్య తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్ డీజేలు!

- మోతమోగిస్తున్న సౌండ్ బాక్సులు
- ధ్వని కాలుష్యంతో ఆరోగ్య సమస్యలు
- పరీక్షల వేళ ఇబ్బందిపడుతున్న విద్యార్థులు
- అధికారులు చర్యలు తీసుకోవాలని వేడుకోలు



పాలకుర్తి, మార్చి 10: జిల్లాలో ఇప్పుడు ఎక్కడ చూసినా వివాహ వేడుకలు, రాజకీయ పార్టీల రోడ్‌షోలు, శంకుస్థాపన కార్యక్రమాలు జరుగుతున్నాయి. కార్యక్రమం ఏదైనా అక్కడ డీజేలు మోగుతున్నాయి. యూట్యూబ్‌లో వచ్చే పాటలను బ్లూటూత్ ద్వారా డీజేలలో వేసి మోత మోగిస్తున్నారు. మనిషి వినగలిగే దాని కంటే ఎక్కువ శబ్దం చేస్తున్నారు. ఇది ప్రమాదకమని, సౌండ్ పరిధి దాటితే చెవి కర్ణబేరి పగిలి పోతుందని, గుండె జబ్బులు వస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు వృద్ధులు, గర్భిణీలకు, గుండెజబ్బు ఉన్న వారికి కూడా ఈ డీజే సౌండ్ ప్రమాదకరమని హెచ్చరిస్తున్నారు.

చట్టం ఏం చెబుతోంది..?

హిస్టరీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ ఫారెస్ట్, నాయిస్ పొల్యూషన్ రెగ్యులేషన్ కంట్రోల్ చట్టం 2000 ప్రకారం.. సగటు మనిషి 75 డెసిబుల్స్ సౌండ్‌ను మాత్రమే వినగలడు. అంతకంటే.. ఎక్కువగా ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా సౌండ్‌ను ఇష్టం వచ్చినట్లు (కెపాసిటీకి మించి) వాడినట్లయితే వారికి ఆరు నెలల జైలు శిక్ష ఉంటుందని చట్టం చెబుతోంది.

ఎంతదాటితే ఏమౌతుంది..?

సాధారణంగా మనిషి వినగలిగే శక్తి సామర్థ్యం 75 డెసిబుల్స్‌గా ప్రభుత్వం నిర్ధారించింది. అంతకు మించి 85 డెసిబుల్స్ సౌండ్ పెడితే.. చెవులు పనిచేయకుండా పోతాయని, 120 వరకు పెడితే.. చెవులు వినబడకపోవడమే కాకుండా చెవి లోపల నొప్పి వస్తుందని చెబుతున్నారు. అలాగే 150 డెసిబుల్స్ వరకు వాడితే.. చెవి కర్ణబేరి పగిలిపోయి రక్తస్రావం కలుగుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతేకాదు.. గుండె జబ్బులు ఉన్నవారు ఒక్కోసారి ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉంటుందని చెబుతున్నారు.

పరీక్షల సమయంలో డీజేలతో ఇబ్బంది..

ఇంతకు ముందు వివాహ వేడుకల్లో మైకులు పెట్టి యువత డ్యాన్సులు చేసే వాళ్లు. ఇప్పుడు మైకులు పోయి డీజేలు వచ్చాయి. వివాహం అనంతరం డీజేలతో వధూవరులను ఊరేగిస్తున్నారు. గత శాసనసభ ఎన్నికల సందర్భంగా కూడా రాజకీయ నాయకులు డీజేలను వాడుతున్నారు. ప్రస్తుతం విద్యార్థులకు పరీక్షలు నడుస్తున్నందున విద్యార్థుల చదువుకు ఆటంకం కలుగుతోంది. సౌండ్ పొల్యూషన్‌పై సంబంధిత అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి సౌండ్ పొల్యూషన్‌ను కంట్రోల్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఫిర్యాదు చేయవచ్చు..

డీజే సౌండ్‌లతో ఇబ్బంది ఎదురైతే అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. డీజే సౌండ్ డెసిబుల్స్ ఎంత ఉందో సౌండ్ మీటర్ డెసిబుల్ అనే ఆప్ ద్వారా తెలుసుకోవచ్చు. ప్రతీ పౌరుడు దీనిపై అవగాహన పెంచుకుని వారికి ఫిర్యాదు చేయవచ్చు. గూగుల్‌లో ఇప్పటికే సౌండ్ సిస్టం గురించి పొందుపరిచారు.

సౌండ్ పెరిగితే ప్రమాదమే..

డాక్టర్ లింగమూర్తి, వైద్యాధికారి పాలకుర్తి



సౌండ్‌ను ఇష్టం వచ్చినట్లు వినే పరిస్థితి ఉండదు. మనిషి తాను 75 డెసిబుల్స్ వరకు చెవికి ఇంపుగా వినగలడు. కానీ అంతకంటే ఎక్కువగా ఉంటే ప్రమాదమే. 85 నుంచి పైకి ఉంటే వినికిడి సమస్యలు రావడమే కాకుండా అధికంగా 150 వరకు చేరితే చెవి కర్ణబేరి పగిలి రక్తస్రావం కలిగే ప్రమాదం ఉంటుంది. అంతేకాదు.. గర్భిణీలు, చిన్న పిల్లలకు సమస్యలు తలెత్తవచ్చు. ముఖ్యంగా గుండెజబ్బులు ఉన్నావారికి మరింత ప్రమాదకరం.

డీజేలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు..

మహేందర్‌రెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, పాలకుర్తి



ప్రస్తుతం విద్యార్థులకు పరీక్షలు ఉన్నందున చదువుకు ఆటంకం కలుగుతుంది. ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగుతుండగా ఈ నెల 18 నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభం అవుతున్నాయి. ఇటీవల ప్రభుత్వం మెగా డీఎస్సీ గ్రూప్స్ ప్రకటన చేసింది. దీంతో కొంత మంది విద్యార్థులు ఇంటి వద్ద ప్రిపేర్ అవుతున్నారు. అందువల్ల ఎవరైన డీజేలతో ఇబ్బంది కలిగిస్తే చర్యలు తీసుకుంటాం.